


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com



# నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం 3 డిసెంబర్ 2025    6 పేజీలు


### పంచాయతీ ఎన్నికల నిర్వహణకు
# పకడ్బందీ ఏర్పాటు
### - రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణీ కుముదిని



**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**

రెండవ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని నిజామాబాద్, కామారెడ్డి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల పరిశీలకులు, పోలీస్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా (మిగతా 2లో)





# నాగారం డంపింగ్ యార్డ్‌ను సందర్శించిన ఎమ్మెల్యే..

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**

ఇందూర్ అర్బన్ అసెంబ్లీ పరిధిలోని నాగారం డంపింగ్ యార్డ్‌ను సందర్శించాను. నా ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం, ఈ డంపింగ్ యార్డ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు బయో-మైనింగ్ ద్వారా శుభ్రపరిచే పనులు వేగంగా కొనసాగుతున్నాయి.డంపింగ్ యార్డుల్లో పేరుకు పోయిన చెత్త వల్ల పరిసరాలకు చాలా సమస్యలు వస్తాయి. ఈ చెత్తను తొలగించడానికి బయో-మైనింగ్ పద్ధతి ఉపయోగిస్తున్నారు. దీనివల్ల పాత చెత్తను వేరు చేసి, శుభ్రపరచి, భూమిని తిరిగి ఉపయోగించుకునేలా చేస్తారు.మొదట చెత్తపై ప్రత్యేక ద్రావణం పిచికారీ చేసి వాసనలు తగ్గిస్తారు. తర్వాత ట్రమ్మెల్ యంత్రం ద్వారా చెత్తను మూడు భాగాలుగా వేరు చేస్తారు-ఎరువుగా ఉపయోగించే భాగం, కట్టడ పనులకు పనికొచ్చే భాగం, మరియు ఫ్యాక్టరీల కోసం ఇంధనంగా ఉపయోగించే మొత్తం 3,51,500 మెట్రిక్ టన్నుల చెత్తను శుద్ధి చేసే ప్రక్రియ త్వరలోనే పూర్తి అవుతుందని అధికారులు వివరించారు.ప్రస్తుతం 2 మిషిన్లు పనిచేస్తుండగా, అదనంగా మరో 2 మిషిన్లు అవసరం పడతాయి అవి (మిగతా 2లో)



### సైబర్ నేరాల నివారణపై "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్"
# కార్యక్రమాన్ని ప్రారంభించిన నగర కమిషనర్
### - నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆరు వారాలపాటు ప్రజలకు అవగాహన కార్యక్రమం.

**సూర్య ఇందూర్**

తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో (TGCSB), హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు , సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేపట్టిన "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" కార్యక్రమాన్ని నిజామాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ (CCPS) ఈరోజు విజయవంతంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ నగరంలోని వివిధ కళాశాలలు,పాఠశాలల విద్యార్థులు, సైబర్ వారియర్స్, స్థానిక పెద్దలు, పోలీసు అధికారులు హాజరయ్యారు. ఇట్టి కార్యక్రమము నేడు హైదరాబాదులోని సైబర్ సెక్యూరిటీ కార్యాలయం నుండి డిజిపి ప్రారంభించడం జరిగింది. నిజామాబాదు పోలీస్ కమీషనరేట్ పరిధిలోని నిజామాబాదు , ఆర్మూర్ , బోధన్ డివిజన్‌లో ఇట్టి కార్యక్రమాలను అనునిత్యం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ఆరు వారాలపాటు ప్రచార కార్యక్రమంలు నిర్వహించడం జరుగుతుంది.దీని ప్రధాన ఉద్దేశం అన్ని జిల్లాలలో పేదవారు, ధనిక వారు అనే తేడా లేకుండా అందరూ ఈ సైబర్ నేరాలకు గురవుతున్నారన్నటువంటి ప్రధాన ఉద్దేశంతో (మిగతా 2లో)




### నేటి నుండి మూడవ దశ
# నామినేషన్ల స్వీకరణ

**సూర్య భీమ్‌గల్**

భీమ్‌గల్ మండలంలో 27 గ్రామపంచాయతీలు, 244 వార్డ్ స్థానాలకు నిర్వహించే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుండి నామినేషన్‌లు నేటి నుండి స్వీకరించడం జరుగుతుందని ఎంపీడీఓ గంగుల సంతోష్ కుమార్ తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎంపీడీఓ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. డిసెంబర్ 3 ఉదయం 10.30 గంటల నుండి 5వ తేది సాయంత్రం 5 వరకు నామినేషన్‌లు స్వీకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. 6న స్క్రూటిని, 9న నామినేషన్ ఉపసంహారణ, అదే రోజులు సాయంత్రం ఫైనల్ లిస్ట్ ప్రకటన ఉంటుంది. ఈ నెల 17న ఉదయం 7 నుండి మధ్యాహ్నాం 1 వరకు పోలింగ్, పోలింగ్ అనంతరం ఎన్నికైన వార్డ్ సభ్యుల సమక్షంలో ఉపసర్పంచ్ ఎన్నిక ఉంటుందని తెలిపారు. ఎన్నికైన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డ్ సభ్యులకు అదే రోజు ధ్రువపత్రాలు (మిగతా 2లో)




### విస్తృత తనిఖీలు నిర్వహించిన
# ఎన్నికల సాధారణ పరిశీలకులు

**సూర్య నిజామాబాద్, జిల్లా ప్రతినిధి**

గ్రామ పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకులు జీవీ.శ్యాంప్రసాద్ లాల్ మంగళవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల పని తీరును, నామినేషన్ స్వీకరణ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ఇందల్వాయి మండలంలో ఎఫ్.ఎస్.టీ బృందాలు చేపడుతున్న తనిఖీలను గమనించి, పలు సూచనలు చేశారు. ఎన్నికలలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే అవకాశం ఉన్నందున గట్టి నిఘా కొనసాగిస్తూ, పకడ్బందీగా సోదాలు జరపాలని అన్నారు. అనంతరం టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును తనిఖీ చేశారు. ఇప్పటివరకు సోదాలలో పట్టుబడిన లిక్కర్ నిల్వల గురించి వివరాలను అడిగి తెలుసుకుని, రిజిస్టర్లు పరిశీలించారు. అక్కడి నుండి ఇందల్వాయి ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుని ఎన్నికల సామాగ్రిని పరిశీలించారు. సజావుగా పోలింగ్ నిర్వహణ కోసం అవసరమైన మెటీరియల్ అందుబాటులో ఉందా అని పక్కాగా పరిశీలన చేసుకోవాలని (మిగతా 2లో)



# ఇంగ్లీష్ ఒలంపియాడ్ టెస్ట్ నిర్వహణ

**సూర్య బాల్కొండ**



బాల్కొండ మండల్ లెవెల్ ఇంగ్లీష్ ఒలంపియాడ్ టెస్ట్ మరియు ఎడుక్వెస్ట్ టాక్ కాంపిటీషన్ బాల్కొండ మండల విద్యాధికారి జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బట్టు రాజేశ్వర్, ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది . ఇందులో బాల్కొండ మండలంలో గల వివిధ పాఠశాలలు జడ్పిహెచ్ఎస్ బాలకొండ,, జడ్పీహెచ్ఎస్ వన్నెల్ బి జడ్.పి.హెచ్.ఎస్ కిసాన్ నగర్ జడ్పీహెచ్ఎస్ చిట్టాపూర్ టీజి మోడల్ స్కూల్, కేజీబీవీ స్కూల్ల మధ్య కాంపిటీషన్ నిర్వహించడం జరిగింది. ఇందులో బాల్కొండ మండల ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు ఓడ్నాల శ్రీనివాస్. డి రాములు కవిత రాణి సంధ్యారాణి చంద్రశేఖర్,రామ్ రెడ్డి మధు దత్తు కావేరి, సుందర్ రెడ్డి.. ఈ పరీక్షలు నిర్వహించి విజేత లను జిల్లాలో జరిగే కాంపిటీషన్ కు పంపడం జరుగుతుంది అని సభ్యులు తెలపడం జరిగింది. మండల్ లెవెల్ విజేతలు స్పీచ్ కాంపిటీషన్లో జడ్పీహెచ్ఎస్ బాల్కొండ సీనియర్ విభాగంలో రింసా సుభూర్ జూనియర్ విభాగంలో రుబీనా,, రైటింగ్ టెస్టులో రైటింగ్ టెస్టులో సీనియర్ విభాగంలో టి అశ్విత జూనియర్ విభాగంలో బి. వైనతేయ. స్పీచ్ కాంపిటీషన్లో కేజీబీవీ మోడల్ స్కూల్ సెగ్మెంట్లో సీనియర్ విభాగంలో మనస్విక మోడల్ స్కూల్ కె రష్మిక మోడల్ స్కూల్ జూనియర్ విభాగంలో బి అంజలీనా ఎస్.కె కాస్ఫా.విజేతలుగా ప్రకటించడమైనది వీరు జిల్లాలో జరిగే కాంపిటీషన్లో పాల్గొనడానికి అర్హత సాధించారని జడ్పిహెచ్ఎస్ బాల్కొండ ప్రధానోపాధ్యాయులు,మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్,ఎల్తా సభ్యులు తెలిపారు.

## స్థానిక ఎన్నికల్లో గెలుపు పై దిశా నిర్దేశం

**సూర్య వేల్పూర్**




టిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థుల గెలుపు పై బాల్కొండ బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి కార్యకర్తలకు నాయకులకు దిశా ని ఉద్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ ప్రజల్ని మోసగించిన కాంగ్రెస్ ప్రభుత్వం వాగ్దానాల విషయంలో మాట తప్పిందని ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని స్థానిక నాయకులకు సూచించారు. గ్రామ గ్రామాన టిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను మహిళలకు చేసినటు వంటి సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండ గట్టాలని సూచించారు. అభ్యర్థులు ఎన్నికల్లో గెలుపు కోసం స్థానిక నాయకులను అమేకం చేసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. బాల్కొండ నియోజకవర్గంలో టిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ స్థానాల్లో ముందు ఒడాలని పేర్కొన్నారు. కచ్చితంగా టిఆర్ఎస్ పార్టీ స్థానిక ఎన్నికల్లో విజయ దుందుభి మోగిస్తుందని అన్నారు.

## నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

**సూర్య వేల్పూర్**

గ్రామపంచాయతీ ఎన్నికల్లో మూడో విడత వేల్పూర్ మండలానికి నిర్వహిస్తున్న దృష్ట నామినేషన్ సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. 18 గ్రామపంచాయతీలకు 108 మెంబర్లు సర్పంచ్ స్థానాలకు గాను ఈ నెల 17న పోలింగ్ జరగనుంది. డిసెంబర్ 3 నుండి సర్పంచులు మరియు వార్డ్ మెంబర్ నామినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. లక్కోరా పోచంపల్లి, హనుమాన్ నగర్, పడగల్, గ్రామపంచాయతీ కీ నామినేషన్ సెంటర్ పడగల్ గ్రామపంచాయతీ సెంటర్ గా ఏర్పాటు చేశారు.కోమనుపల్లి, కుకునూర్, అంక్సాపూర్, నామినేషన్ కేంద్రం అంక్సాపూర్ గ్రామపంచాయతీ, వేల్పూర్ అమీ నాపూర్, సాహెబ్పేట్, వెంకటాపూర్, కు వేల్పూర్ పంచాయతీ నామినేషన్ కేంద్రంగా రామన్నపేట, అక్లూర్, మోతే గ్రామపంచాయతీ నామినేషన్ కేంద్రం ,కొత్తపెల్లి, వాడి, జాన్కంపేట్ గ్రామాలు పచ్చలనాకుడ గ్రామపంచాయతీలో నామినేషన్ స్వీకరణ కేంద్రాల ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలియజేశారు.

## బిజెపి పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా సామ నర్సయ్య

**సూర్య వేల్పూర్**

వేల్పూర్ మండలం పడగల్ గ్రామంలో బిజెపి పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా సామ నరసయ్య పోటీ చేయడానికి పార్టీ తరపున ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని బిజెపి నాయకులు తెలిపారు. కావున గ్రామ ప్రజలందరూ బిజెపి అభ్యర్థి సామ నర్సయ్యకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు బండి రఘు, కొట్టాల ప్రవీణ్, బడకల రాజేందర్ ,ఏనుగుమోహన్, శక్తి కేంద్రం ఇంచార్జ్ రమేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కి ఆటో యూనియన్ల జేఏసీ వినతిపత్రం

**సూర్య బాన్సువాడరూరల్**



తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ల జేఏసీ ప్రతి నిధులు శుక్రవారం బాన్సువాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డిని కలిశారు. కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల మేనిఫెస్టోలో ఆటో డ్రైవ ర్లకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని వారు వినతి పత్రం సమర్పించారు.జేఏసీ నాయకులు పేర్కొన్న ప్రకారం, మేనిఫెస్టో లో ఉన్న ఆటో సంక్షేమ బోర్డు ఏర్పాటు,ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి 12,000 ఆర్థిక సహాయం,ఆటో నగర్ల అభివృద్ధి వంటి హామీలు ఇంకా నెరవేర్చలేదని ఆందోళన వ్యక్తం చేశారు.హామీలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మంద రవి కుమార్, కామా రెడ్డి జిల్లా అధ్యక్షులు ఉమర్ ఖాన్, భూషణ్ గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## లయన్స్ భవనంలో కంటి వైద్య శిబిరం

**సూర్య బాల్కొండ**




బాల్కొండ మండలం కిసాన్ నగర్ లోని లయన్స్ భవనం లో మంగళవారం బాల్కొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్మూర్ లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ పుణ్యరాజు 30 మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో మోతి బిందు ఉన్న వారిని గుర్తించి శస్త్ర చికిత్సల కోసం ఆర్మూర్ లయన్స్ కంటి ఆసుపత్రికి తరలించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు రామ్ రాజ్ గౌడ్, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చాకు లింగం, జోనల్ చైర్మన్ జ్ఞాన సాగర్ రెడ్డి, బాల్కొండ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దినేష్ పటేల్, కోశాధికారి వంశీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేల్పూర్ లో ఈ ఎల్ టి ఏ మండల స్థాయి పోటీలు

**సూర్య వేల్పూర్**

వేల్పూర్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్ అసోసియేషన్ ఒలంపియాడ్ అండ్ ఎలోకేషన్ పోటీలు నిర్వహించడం జరిగిందని ప్రధానోపాధ్యాయులు రాజన్న తెలిపారు. ఈ పోటీలలో మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి స్థానంలో వేల్పూర్ పాఠశాల చెందిన రోహన్ విభాగంలో అంక్సాపూర్ కు చెందిన సహస్ర ఎలోకేషన్ సీనియర్ విభాగంలో వేల్పూర్ పాఠశాల చెందిన జూనియర్ విభాగంలో వేల్పూర్ పాఠశాల చెందిన ఎస్కే నూరుద్దీన్ స్థానాల్లో గెలుపు నిలిచారని అన్నారు. గెలుపొందిన విద్యార్థులకు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజన్న బహుమతులు అందజేశారూ. గెలుపొందిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.




## మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కార్యదర్శిగా నాగరాజు

**సూర్య- బిక్కనూర్**




మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కార్యదర్శిగా మండలంలోని రామేశ్వర్ పల్లి గ్రామానికి చెందిన కడారి నాగరాజును, మంగళవారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఆదేశాల మేరకు నియమించడం జరిగిందని, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమ్ రెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతు దారుల గెలుపునకు కృషి చేస్తానన్నారు

## బిఆర్ఎస్, బిజెపిల నుండి కాంగ్రెస్ లో చేరికలు


**సూర్య- బిక్కనూర్**



మండలంలోని తిప్పపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాములు,బాలరాజు,రాజ్ కుమార్,బీజేపీ పార్టీకి చెందిన సాయిరాంగౌడ్, హర్షవర్ధన్ రెడ్డి,శ్రీమన్, దీపక్,చందు,సాగర్ గౌడ్, సతీష్ లు తమ తమ పార్టీలకు రాజీనామా చేసి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనలో కొనసాగుతున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నట్లు వారు ప్రకటించారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు దారుడి విజయానికి కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, మండల అధ్యక్షుడు భీమ్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కుంట లింగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో మెజార్టీ సర్పంచ్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుంది

**సూర్య- బిక్కనూర్**



జిల్లాలో మెజార్టీ సర్పంచ్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు కైవసం చేసుకుంటారని, టిపీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి చెప్పారు. మంగళవారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సర్పంచ్ ఎన్నికల వివరాలపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కు వివరించారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం అయ్యాయని, ఈనెల 11వ తేదీన జరగనున్న తొలి విడత ఎన్నికల్లో మెజార్టీ స్థానాలలో కాంగ్రెస్ పార్టీ మద్దతు దారులు విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## ఎన్నికలపై అవగాహన కార్యక్రమం

**సూర్య వేల్పూర్**



గ్రామపంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ గ్రామాల్లోని ఓటు వినియోగదారులకు అలాగే రాజకీ య నాయకులకు పార్టీ కార్యకర్తలకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల్లోని వేలంపాట ద్వారా సర్పంచి ను ఎన్నుకోవడం చట్టబద్ధంగా విరుద్ధమని దానిని అమలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. అదే విధంగా సామాజిక మాధ్యమాలలో తప్పుడు ప్రచారాలు చేస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయన్న విషయం గ్రహించాలని సిఐ శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఎవరైనా చట్టానికి సమానులేమీ ఎన్నికల నిబంధన ప్రకారం ప్రతి ఒక్కరు నడుచుకోవాలని సూచించారు .ఈ కార్యక్రమంలో ఎస్సై సంజీవ్ హెడ్ కానిస్టేబుల్ నారాయణ, సాయికుమార్ గ్రామపంచాయతీ కార్యదర్శి సజన్ కుమార్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ లో చేరికలు

**సూర్య మోపాల్**

మోపాల్ గ్రామ మాజీ సర్పంచ్ రవి, భారాస గ్రామ అధ్యక్షుడు కెంపు సాయిలు ఏఎంసీ చైర్మెన్ ముప్ప గంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. వీరికి కండువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించి మాట్లాడారు. పంచాయతీ ఎన్నికల్లో పార్టీ మద్దతుదారులను గెలిపించాలని కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు సాయి రెడ్డి, మాజీ సర్పంచ్ గణపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలను అణగదొక్కే ప్రయత్నం అగ్రవర్ణాల కుట్రా!

**సూర్య కామారెడ్డి టౌన్**

జిల్లా కేంద్రంలో కామారెడ్డి యాదవ సంఘం ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన.



నల్గొండ జిల్లా లోని తిప్పర్తి మండలం ఎల్లమ్మ గూడెంగ్రామంలో సర్పంచ్ కి సంబంధించిన రిజర్వేషన్ జనరల్ కి కేటాయించడం జరిగింది, ఆ జనరల్ స్థానానికి బీసీ బిడ్డ యాదవ సామాజిక వర్గానికి చెందిన మామిడి యాదయ్య యాదవ్ భార్య అయిన మామిడి లక్ష్మిఒక మహిళ సర్పంచ్ నామినేషన్ వేయడానికి ప్రయత్నాలు ప్రారంభించారు.కానీ అగ్రవర్ణ నాయకులైన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతలు ఏకగ్రీవం చేసుకోవడానికి బీసీ అభ్యర్థిని నానా రకాలుగా భయపెట్టే ప్రయత్నం చేశారు.కానీ ఆ అభ్యర్థి ఒప్పుకోకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో నామినేషన్ వేయడానికి బీసీ మహిళా అభ్యర్థి వెళ్లే క్రమంలో కారు కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థి భర్తను కిడ్నాపు చేసి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి చిత్రహింసలు చేశారు.అంతే కాకుండా బూతులు తిడుతూ మధ్యంలో మూత్రం పోసి గోరాతి గోరంగా తాగించి అవమానించారు. మానసికంగా శారీరకంగా చిత్రహింసలు గురి చేశారు,నామినేషన్ వేయవద్దని అనేక రకాలుగా అడ్డుకున్నారు ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎలక్షన్లో పాల్గొనే హక్కు ప్రతి భారతీయుడికి భారత రాజ్యాంగం కల్పించిన హక్కు ఆ హక్కును కాలరాయడానికి ఎవరికీ అధికారం లేదు.కాబట్టి నల్గొండ జిల్లా కలెక్టర్ గాని స్థానిక ఎలక్షన్ ఆఫీసర్ గాని దాడి చేసిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా కామరెడ్డి యాదవ సంఘం డిమాండ్ చేయడం జరిగింది అదే విధంగా దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని లేని యెడల యాదవ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని కామారెడ్డి యాదవ సంఘం తరపున హేచ్చరించడం జరుగింది. ఈ కార్యక్రమంలో జిల్లా యాదవ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కుంభాల లక్ష్మణ్ యాదవ్ మడుగుల భూమేష్ యాదవ్ కన్నబోయిన వెంకట్ యాదవ్ కన్నబోయిన మురళి యాదవ్ కంబాల రాజు కంబాల భాను యాదవ్ కంబాల ప్రభాకర్ ఉడుతల బాలన్న యాదవ్ ఉడతలశ్రీనివాస్ యాదవ్ మడుగుల నవీన్ యాదవ్ అర్కల రాజు యాదవ్ అర్కల రాజేష్ యాదవ్ కంబాల ప్రభాకర్ యాదవ్ కుంబాల ప్రకాష్ యాదవ్ నరేష్ యాదవ్ కుంభాల రమేష్ యాదవ్ మరియు యాదవ సంఘం రాజేష్ యాదవ్ సంజు యాదవ్ వంశీ యాదవ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వన్నెల్ (బి) విద్యార్థులకు ప్రశంస

**సూర్య బాల్కొండ**



తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో హైదరాబాద్ లో నిర్వహించిన 'బాలల సాంస్కృతికోత్సవం' పోటీలలో వన్నెల్ బి పాఠశాల విద్యార్థులు పాల్గొని కథలు, కవితలు రాసి, చిత్రాలను గీసి ధృవీకరణ ప్రశంసా పత్రాలను అందుకున్నారని గైడ్ టీచర్ వివేకవర్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## విద్యార్థులకు మండల స్థాయి ఇంగ్లీష్ ప్రతిభ పరీక్ష

**సూర్య రెంజల్**




విద్యార్థులకు మండల స్థాయి ఇంగ్లీష్ ఒలంపియాడ్ అండ్ ఎడిక్విస్ట్ టెస్టును నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారి ఆంజనేయులు తెలిపారు. మంగళవారం రెంజల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలంలోని వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థులకు మండల స్థాయి ఇంగ్లీష్ ప్రతిభ పరీక్ష నిర్వహించినట్లు ఆయన తెలిపారు. మండల స్థాయి టెస్ట్ ప్రశ్న పత్రాన్ని విడుదల చేశారు. మండల స్థాయి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలలో పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు మండల అధ్యక్షుడు సోమలింగం గౌడ్, మండల ఇంగ్లీష్ కోఆర్డినేటర్ ఖామరన్నిసా బేగం, ఉపాధ్యాయులు కిషోర్, శంకర్, గులాబ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## హామలీల మధ్య గొడవ...కేసు నమోదు

**సూర్య మాక్లూర్**

హామలీల మధ్య గొడవ జరిగిన ఘటన చోటుచేసుకుంది.మాక్లూర్ ఎస్ఐ రాజశేఖర్ కథనం ప్రకారం ఆలూరు మండలం గుత్ప గ్రామంలో సోమవారం రాత్రి హామలీల మధ్య గొడవ జరగగా అట్టి గొడవలో సంతోష్,గుడ్డు కుమార్ మధ్య గొడవ అవ్వగా గుడ్డు కుమార్,సంతోష్ ను దొరకబట్టి సంతోష్ తలను సిమెంట్ బేస్మెంట్ కీ బలంగా కొట్టగా తోటి హమాలీలు 108 అంబులెన్స్ లో తరలించారు.సంతోష్ పరిస్థితి విషమంగా ఉండటంతో గుడ్డు కుమార్ పై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

## మహిళా,శిశు సంక్షేమ వయో వృద్ధుల అవగాహనా సాధస్సు

**సూర్య బాల్కొండ**




మహిళా, శిశు సంక్షేమ, వయో వృద్ధుల శాఖ జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బాల్కొండ పభుత్వ జెడ్పిహెచ్ఎస్ హై స్కూల్ పాఠశాల నందు బాల్య వివాహ విముక్త్ భారత్ కార్యక్రమం లో భాగంగా అవగాహనా కార్యక్రమం నిర్వహించాడం జరిగింది.ఈ కార్యక్రమంలో లింగ సమానత్వం, లింగ వివక్ష వంటి, బాల్య వివాహల వల్ల కలిగే నష్టాలు, బిబిబిపి స్కీమ్స్ గురించి మరియు, సుకన్య సమృద్ధి యోజన స్కీం, మిషన్ వత్సల్య స్కీం గురించి,పోక్సో చట్టం గురించి,1098 చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్, 181 మహిళా హెల్ప్ లైన్ నెంబర్ గురించి సౌమ్య, కవిత జెండర్ స్పెషలిస్ట్ వివరించడం జరిగింది, మరియు సఖి కేంద్రం సెంటర్ అడ్మినిస్ట్రేటర్ భాను గారు సఖి కేంద్రం సేవలు, ఆన్ లైన్ వేధింపులు,హెల్ప్ లైన్ నెంబర్లు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, పాఠశాల సిబ్బంది, స్టూడెంట్స్ పాల్గొన్నారు.

## ఈ నెల 3, 4 తేదీలలో నవీపేట్ ప్రధాన రైల్వే గేట్ మూసివేత

**సూర్య ఇందూర్**

మరమ్మతులు కొనసాగుతున్న దృష్ట్యా నవీపేట వద్ద గల 188 నెంబర్ లెవెల్ క్రాసింగ్ రైల్వే గేటును 2025 డిసెంబర్ 3, 4వ తేదీలలో మూసి ఉంచడం జరుగుతుందని దక్షిణ మధ్య రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ బి.శ్రీనివాస్ తెలిపారు. మరమ్మత్తులు, డబ్లింగ్ పనులు చేపట్టాల్సిన కారణంగా ఈ నెల 3 ఉదయం 6.00 గంటల నుండి ఆ మరుసటి రోజు అయిన 4వ తేదీ సాయంత్రం 6.00 గంటల వరకు రైల్వే గేటు మూసి ఉంచబడుతుందని అన్నారు. 4వ తేదీన సాయంత్రం 6.00 గంటల అనంతరం రైల్వే గేటును తెరుస్తామని, రాకపోకలు యధావిధిగా పునరుద్ధరించబడతాయని తెలిపారు. ప్రయాణికులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించి, మరో రెండు రోజుల పాటు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాకపోకలు జరపాలని సూచించారు. నిజామాబాద్-బాసర మార్గంలో ప్రయాణించాల్సిన ద్విచక్ర వాహనదారులు కమలాపూర్ మహంతం, మొకనపల్లి, గుండారం మీదుగా, ఇతర వాహనదారులు కల్యాపూర్, సాటాపూర్, తడ్బిలోలి, ఫకీరాబాద్ మీదుగా రాకపోకలు సాగించాలని సీనియర్ సెక్షన్ ఇంజినీర్ బీ.శ్రీనివాస్ తెలిపారు.

## డిక్షనరీలు పంపిణీ

**సూర్య బాల్కొండ**



బాల్కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం బాల్కొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డిక్షనరీలు పంపిణీ చేశారు. విద్యార్థులకు ఉచితంగా డిక్షనరీలు పంపిణీ చేసిన లయన్స్ క్లబ్ సభ్యులను ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు ప్రశాంత్ కుమార్ అభినందించారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చాకు లింగం, జోనల్ చైర్మన్ జ్ఞాన సాగర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సర్పంచ్ ఎన్నికల్లో బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు

**సూర్య- బిక్కనూర్**



సర్పంచ్ ఎన్నికలలో ఏకగ్రీవం కొరకు వేలంపాటలు,నామినేషన్ వేసిన వారిపై బెదిరింపులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఆంజనేయులు సూచించారు. మంగళవారం మండలంలోని లక్ష్మీదేవునిపల్లి గ్రామంలో ఒక వర్గానికి చెందిన వ్యక్తులు సమావేశమై,కొందరు వ్యక్తుల నామినేషన్ విత్ డ్రా కొరకు ఒత్తిడి చేస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు మంగళవారం గ్రామ అఖిలపక్ష నాయకులతో సమావేశాన్ని నిర్వహించి, ఎన్నికలలో ఏకగ్రీవం కొరకు వేలంపాటలు,నామినేషన్ వేసినవారిపై విత్ డ్రా కొరకు బెదిరింపులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని ఏ గ్రామంలో అయినా పోటీలో ఉన్న అభ్యర్థులను బెదిరింపులకు పాల్పడకుండా, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అఖిలపక్ష నాయకులు ఉన్నారు

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో లారీ డ్రైవర్ కు జైలు శిక్ష

**సూర్య- బిక్కనూర్**



మద్యం సేవించి వాహనాన్ని నడుపుతున్న లారీ డ్రైవర్ కు మంగళవారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ చంద్రశేఖర్ రెండు రోజుల జైలు శిక్ష తోపాటు వెయ్యి రూపాయల జరిమానా విధించినట్లు ఎస్సై ఆంజనేయులు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం వాహన తనిఖీలలో మద్యం సేవించి వాహనాన్ని నడుపుతున్న ఉత్తర ప్రదేశ్ కు చెందిన డ్రైవర్ ఇరాక్ ఖాన్ ను అదుపులోకి తీసుకొని మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా జైలు శిక్ష విధించినట్లు, ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలుకెళ్లడం ఖాయమన్నారు.

## గర్భిణీలు బలమైన పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

**సూర్య- బిక్కనూర్**



గర్భిణీలు బలమైన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, మండల ఇన్చార్జి వైద్యురాలు దివ్య సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అమ్మఒడి కార్యక్రమంలో భాగంగా, మండలంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన గర్భిణీలకు రక్త పరీక్షలు, ఎత్తు,బరువు,రక్తపోటు పరీక్షలు అవసరమున్నవారి కి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో ల్యాబ్ టెక్నీషియన్ వనశ్రీ, సూపర్వైజర్ సువర్ణ, ఏఎన్ఎం మాధవి, ఆశా కార్యకర్తలు గర్భిణీలు ఉన్నారు

## డిప్యూటీ డిఎంఅండ్ హెచ్ఓని ఘనంగా సన్మానించిన మండల అంబేద్కర్ నాయకులు

**సూర్య కమ్మర్ పల్లి**



ఇటీవలే డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓగా పదోన్నతి పొంది పదవి బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఎన్.రవీందర్ వారి కార్యాలయంలో, కమ్మర్ పల్లి మండల అంబెద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో వారిని కలిసి ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల అంబెద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సుంకరి విజయ్ కుమార్ మండల అంబెద్కర్ యువజన సంఘం కార్యవర్గ సభ్యులు దాసరి రాకేష్, వినయ్, ఆంజనే యులు, అనిల్,అమర్,చందు,శ్రవణ్ ,నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐటియుసి ఆధ్వర్యంలో జిజిహెచ్ ప్రభుత్వ ఆసుపత్రి ముందు ధర్నా

## - కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని - ఏఐ టి యూ సి..డిమాండ్

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**




కామారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ముందు. 26 వేల వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ . అనుబంధ సంఘం మెడికల్ ఎంప్లాయ్ వర్కర్స్ యూనియన్%జ% ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది. గత కాంట్రాక్టర్ల సమయం అయిపోయినందున నూతన కాంట్రాక్టర్లకు హాస్పటల్ టెండర్లు కామారెడ్డి ఎల్లారెడ్డి దోమకొండ బాన్సువాడ పిట్లం మద్నూరు జుక్కల్ గాంధారి జిల్లాలో ఉన్నటువంటి ఆస్పత్రులను పడకల పెంచాలని అదేవిధంగా సమాన పనికి సమన వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని. పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం పగడ్బందీగా అమలు చేయాలని. కార్మికులకు పని భద్రత కల్పించాలని మూడు రోజులపాటు ఈరోజు రేపు ఎల్లుండి మూడు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా ఆస్పత్రుల నందు ధర్నా నిర్వహించి. డిసెంబర్ 5వ తేదీన వైద్య విధాన పరిషత్ కమిషనర్ వద్ద భారీ బహిరంగ సభ ధర్నా నిర్వహిస్తున్నట్లు మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్. ఏఐటీయూసీ అనుబంధ సంఘం పిలుపునివ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు. ఎల్. దశరథ్ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి బాలరాజు ఏఐటీయూసీ జిల్లా నాయకులు ప్రవీణ్ కామారెడ్డి జిల్లా ఆస్పత్రి కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కె శ్రీనివాస్. ఎండి రఫీక్ లక్ష్మి పాజియా దేవయ్య పద్మ సునీత ప్రవీణ్ దేవరాజు జావిద్ భాస్కర్ అఖిల అనిత ఉమేర బేగం. నరసమ్మ జమున వెంకటలక్ష్మి దశరథ్ నరేష్ రామచంద్రం మునీర్ ఆర్ పద్మ గంగాధర్ దేవయ్య శ్రీనివాస్ ధర్నా కార్యక్రమంలో కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి కార్మికులు పాల్గొన్నారు. మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్. ఏఐటీయూసీ అనుబంధ సంఘం. ఎల్. దశరథ్. పి బాలరాజ్ కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏఐటీయూసీ నాయకులు సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మార్పు కోసం మైత్రేయి ని గెలిపించాలి

**సూర్య- బిక్కనూర్**



మండల కేంద్ర మేజర్ గ్రామపంచాయతీ సర్పంచి గా,ఎన్నారై పెద్దబచ్చాగారి మైత్రేయి శ్రీధర్ రెడ్డిని గెలిపించాలని మంగళవారం పట్టణ ప్రజలకు ఆమె విజ్ఞప్తి చేశారు. తాను ఉన్నత విద్య చదువుకున్నాన ని, అమెరికాలో చాలా సంవత్సరాలు ఉండి, స్వగ్రామ అభివృద్ధి కోసం గత 9 సంవత్సరాలుగా తన కుటుంబంతో కలిసి సొంత ఊరిలో ఉంటూ తనవంతు సహాయ సహకారాలను అందిస్తున్నానని,పట్టణ అభివృద్ధి కోసం విజన్ తయారుచేసి ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరు ఉపయోగించుకునేలా కార్యచరణ రూపొం దించామని, ప్రజలలో మార్పు రావాలంటే ఉన్నత విద్య అవసరమని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల్లోని చదివించేలా తనకు అవకాశం కల్పిస్తే కృషి చేస్తానని, తాను ఎలాంటి లాభం కోసం రాజకీయాలలోకి రావడం లేదని, ప్రజలకు కావలసిన విద్య, వైద్యం, మౌలిక వసతులు కల్పనకు తాను కృషి చేస్తానని, విద్యావంతులు ఒకసారి ఆలోచించి తనకు అవకాశం కల్పించా లని పట్టణ ప్రజలను ఆమె కోరారు.

# కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**సూర్య- బిక్కనూర్**



మండలంలోని తెలంగాణ యూనివ ర్సిటీ పరిధిలోని, దక్షిణ ప్రాంగణంలో కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని,కాంట్రాక్ట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ నారాయణ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం దక్షిణ ప్రాంగణంలో కాంట్రాక్ట్ అధ్యాపకులతో కలిసి సమావే శాన్ని నిర్వహించారు. ఈనెల 7వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటిస్తున్న సందర్భంగా కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలను వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు డాక్టర్ సునీత,డాక్టర్ యాదాద్రి, డాక్టర్ నిరంజన్ శర్మ,డాక్టర్ వైశాలి,డాక్టర్ సరిత,డాక్టర్ శ్రీకాంత్, దిలీప్ పాల్గొన్నారు

# బీడీ కార్మికుల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని కరపత్రం ఆవిష్కరణ

**సూర్య కామారెడ్డి టౌన్**



తెలంగాణ రాష్ట్రంలోని బీడీ పరిశ్ర మంలో పనిచేస్తున్న బీడీ కార్మికులు చాటన్ బట్టి హమాలీ ప్యాకర్స్ మినిమం కమిషన్ ఏజెంట్స్ ల సంక్షేమ ఆర్థిక అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం బీడీ కార్మికుల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని మజ్దూర్ జనతా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షు లు రాపల్లి శ్రీనివాస్ కరపత్రం ఆవిష్కరణ చేశారు. బీడీ కార్మికులందరికీ డిజిటల్ హెల్త్ కార్డ్స్ ఈఎస్ఐ సౌకర్యం అమలు చేయాలని నిజామాబాద్ జిల్లాలో 500 పడకల మల్టీ సూపర్ స్పెషాలిటీ బీడీ కార్మికుల హాస్పిటల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. షరతులు లేకుండా కటాఫ్ తేదీ ఎత్తివేసి 2016/ రూపాయల జీవనభృతిని ప్రతి ఒక్కరికి మంజూరు చేయా లన్నారు.బీడీ కార్మికుల పిల్లలందరికీ స్కాలర్షిప్ లు మంజూరు చేయాలని, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న బీడీ కార్మికుల పిల్లలందరికీ విద్యా హక్కు చట్టం 2009 ను అమలు చేయాలని ప్రభుత్వమును కోరారు.ఇల్లు లేని బీడీ కార్మికులందరికీ ప్రతి గ్రామంలో ఇల్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. బీడీ కార్మికుల తరఫున పోటీ చేస్తున్న సర్పంచ్ అభ్యర్థులకు రాపల్లి శ్రీనివాస్ మద్దతు తెలిపారు.

# ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు మండల ఉపాధ్యాయుడి ఎంపిక

**సూర్య- బిక్కనూర్**



మండలంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఫిజికల్ సైన్సు ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న తమ్మల రాజు చండీగఢ్‌లోని పంజాబ్ యూనివర్సి టీలో డిసెంబర్ 6 తేదీ నుంచి జరుగనున్న ఇండి యా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ కు ఎంపిక య్యాడు.దీనికి సంబంధించిన ఆహ్వానం భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని భూ శాస్త్రాల మంత్రిత్వ శాఖ, సైన్స్ మరియు టెక్నాలజీ మంత్రిత్వ శాఖ నుంచి లేఖ అందిందని మంగళవారం ఆయన తెలిపారు.ఈ ఎంపిక ప్రక్రియ విద్యావేత్తలు,ఉపాధ్యాయులు సమర్పించే ప్రాజెక్ట్‌లు, వారి నైపుణ్యాలు,ఆత్మనిర్భర్ భారత్ కోసం వంటి అంశాలు పరిగణనలోకి తీసుకుని దేశవ్యాప్తంగా ఈ ఎంపిక కార్యక్రమం జరిగింద న్నారు.ఈ ఫెస్టివల్ ప్రధాన లక్ష్యం విజ్ఞాన్ సే సమృద్ధి ఆత్మనిర్భర్ భారత్ కోసం సృజనాత్మకతను ప్రేరేపించడానికి,శాస్త్రీయ ఉత్సుకతను ప్రోత్సహిం చడానికి రూపొందించబడిన ఏకీకృత జాతీయ వేదికపై శాస్త్రవేత్తలు, ఆవి ష్కర్తలు, విద్యావేత్తలు,విద్యార్థులు, పరిశ్రమ నాయకులను, విధాన రూపకర్త లను ఒకచోట చేర్చడం లక్ష్యంగా నిర్వహిస్తుందని రాజు తెలిపా రు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనాథ్,మండల విద్యాధికారి రాజ గంగారెడ్డి,ఉపాధ్యాయులు భవాని,సరిత,ప్రసన్న అభినందించారు

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంగన్వాడి కేంద్రానికి మ్యాట్స్ పంపిణి

**సూర్య,బీర్కూర్**



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంగన్వాడి కేంద్రం లోని పిల్లలకు మ్యాట్స్ ని అందజేశారు. లైయన్స్ క్లబ్ అధ్యక్షుడు సీతాలే రమేష్ మాట్లాడుతూ ప్రతి మంగళవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తామని అలాగే డయాబెటిక్ క్యాంపును కూడా ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు సద్వినియోగం చేసుకు ంటున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ సుమలత, జోన్ చైర్మన్ కొట్టురి సంతోష్, సీనియర్ లయన్స్ రషీద్, ల్యాబ్ టెక్నీషియన్ ప్రవీణ్, అంగన్వాడి కార్యకర్తలు శివజ్యోతి పాల్గొన్నారు.

# పోలీస్ కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్ చేసిన పోలీసులు

**సూర్య ఎల్లారెడ్డి**



ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఇనాంధార్ గల్లి,లో నివసించే రేష్మ అనే మహిళ తన భర్త నజీమ్ తరచుగా మద్యం సేవించి వేధిస్తుండడంతో సోమ వారం రాత్రి తొమ్మిది గంటల 40 నిమిషాల సమయంలో దయల్-100కు కాల్ చేసింది. సమాచారం అందుకున్న వెంటనే పెట్రోల్ కార్ సిబ్బందిలోని కానిస్టేబుల్ కె. సాయికిరణ్ ఘటనాస్థలానికి చేరుకొని పరిస్థితిని అర్థం చేసుకొని నజీమ్‌ను శాంతింపజేయడానికి ప్రయత్నించారు.అయితే, నజీమ్ ఆగ్రహంతో విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తించడమే కాకుం డా, ఇంట్లో ఉన్న కత్తితో దాడి చేయడానికి ప్రయత్నించాడు. వెంటనే అప్ర మత్తమైన కానిస్టేబుల్ దాడి నుంచి తప్పించుకున్నారు. ఈ ఘటనపై పోలీ సులు కేసు నమోదు చేసిన నిందితుణ్ణి అదుపులోకి తీసుకుని, మంగళవా రం నజీమ్ ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు..!

**విధుల్లో ఉన్న పోలీసులపై ఎవరైనా దాడి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం..**

సర్కిల్ ఇన్స్పెక్టర్ డి ,రాజారెడ్డి

విధుల్లో ఉన్న పోలీసులపై ఎవరైనా దురుసుగా ప్రవర్తించినా, లేదా దాడికి యత్నించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎల్లారెడ్డి సర్కిల్ ఇన్స్పెక్టర్ డి రాజారెడ్డి , హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎస్సై బొజ్జ మహేష్ పోలీసులు ఉన్నారు

# పాఠశాలలో విద్యార్థులకు అవగాహన


**సూర్య మోపాల్**



మోపాల్ మండలంలోని బోర్గం (పి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భేటీ బచావ్ - బేటీ పడవ్, కార్యక్రమం లో అవేర్ నెస్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. ఈ సందర్భ ంగా డిస్ట్రిక్ హబ్ ఎంపవర్ మెంట్ ఆఫ్ ఉమేన్ ప్రతినిధులు కవిత, సౌమ్య మాట్లాడు తూ బాలికలకు చదువు ప్రాముఖ్యతను వివరించారు. టెక్నాలజీని తప్పుగా వాడుకుంటే కలిగే అనార్థలపై అవగహన కలిపించారు. బాలికలకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే 1098 నంబరును సంప్రదించాలని సూసిం చారు. అనంతరం సఖి కేంద్రం ప్రతినిధులు వివిధ అంశాలపై అవగహన కల్పించారు. కార్యక్రమం లో సఖి సెంటర్ ప్రతినిధి స్వరూప, పాఠశాల ఎచ్ ఎం శంకర్, టీచర్లు, శ్రీకాంత్, కరుణ శ్రీ దేవి, పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ లో చేరిన పలువురు యువకులు

**సూర్య,బీర్కూర్**



బీర్కూర్ మండల కేంద్రాని కి చెందిన పలువురు యువకులు బాన్సువాడ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్ మరియు అంజిరెడ్డి సమక్షంలో బిఆర్ ఎస్ లో చేరారు. 20 మంది యువకులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. స్థానిక సంస్థలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపిం చే విధంగా ముందుకు సాగాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బాలకృష్ణ, రాములు, ధర్మ తేజ, కృష్ణ తదితరులు ఉన్నారు.

# దత్త జయంతి మహోత్సవ ఆహ్వానం

**సూర్య వేల్పూర్**



ప్రతి ఏటా అంగరంగ వైభవంగా అంక్సాపూర్ లోని దత్తాశ్రమంలో నిర్వహించే దత్త జయంతి వేడుకల కు ఆశ్రమ నిర్వాహకులు ఆహ్వానం పలుకుతున్నట్లు వెల్లడించారు. ప్రతి ఏటా నిర్వహించే దత్త జయంతి వేడుకల్లో ఈనెల 4వ తేదీన అనగా గురువారం శ్రీ గురు చరిత్ర సప్తహ పారాయణం, శ్రీ దత్తుని డోలా రోహణము, శ్రీ గురుపాదుక పూజ, భజన కార్యక్రమం, అన్న ప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. సాయంత్రం వేళ దత్తుని పల్లకి సేవ ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు .ఇట్టి కార్యక్రమాలు శ్రీశ్రీశ్రీ గురుదేవులు విట్టల్ గౌడ్ మహారాజ్ గారి ఆశీర్వాదంతో నిర్వహిస్తు న్నట్లుగా జగతి మహారాజ్ తెలిపారు. కావున భగవత్ బంధువులందరూ ఇట్టి కార్యక్రమం విచ్చేసి శ్రీ దత్త గురు యొక్క తీర్థ ప్రసాదాలు స్వీకరించి దత్త కృపకు పాత్రులు కావాలని తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి సంతోష్ కుమార్

**- వెల్లుట్లలో భారీ జనస్పందన మధ్య నామినేషన్ దాఖలు చేశారు - సంతోష్ కుమార్ ఎంట్రీతో ఎన్నికల వేడి పెరుగుదల**

**- యువత-మహిళల మద్దతు సంతోష్‌కు బలం -సేవాభావమే ప్రజల విశ్వాసానికి కారణం**

**సూర్య ఎల్లారెడ్డి**



ఎల్లారెడ్డి: అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, శుభారంభానికి సూచికగా కొబ్బరికాయ కొట్టి నామినేషన్‌కు బయలుదేరిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు జక్కుల సంతోష్ కుమార్ తో వెల్లుట్ల గ్రామం మంగళవారం సందడిగా మారింది. తెలంగాణ ఉద్యమ జ్వాలలు మోసుకొచ్చిన యువ నాయకుడు, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి సర్పంచ్ బరిలో నిలుస్తుండటంతో గ్రామంలో రాజకీయ వేడి క్రమంగా పెరుగుతోంది. గ్రామ పెద్దలు, ఆశావహులు, యువత, మహిళలు భారీగా తరలి వచ్చి ఆయన నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో వెల్లుట్లలో ఉత్సవ వాతావరణం నెలకొంది. విద్యార్థి దశ నుంచే విద్యార్థి సంఘం నాయకుడిగా, విద్యార్థుల హక్కులపై బాధ్యత చూపిన సంతోష్ కుమార్, ఎల్లారెడ్డి పరిసర ప్రాంతాల్లో ప్రజా సమస్యలపై ఎప్పుడూ ముందుండి పోరాడే నాయకుడిగా మంచి పేరు తెచ్చుకున్నారు. సామాన్య మధ్యతరగతి కుటుంబంలో పుట్టి, ప్రధానోపాధ్యాయుడైన తండ్రి ఆచార్యత్వం, సేవాభావం వారసత్వంగా రాగా. 'పదవి కంటే బాధ్యత గొప్పది' అనే ధృక్పథంతో ప్రజా సేవలో నడుస్తున్న నాయకుడు ఆయన. తెలంగాణ ఉద్యమ రోజుల్లో గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థుల కష్టాలు, ప్రజల ఆశలు ఆయనను ఉద్యమానికి దగ్గర చేశాయి. ఆ రోజుల్లో చేసిన సేవే నేడు ప్రజల విశ్వాసానికి కారణమైంది. గ్రామాభివృద్ధికి కట్టుబాటుతో, పారదర్శక పాలనా పద్ధతులపై నమ్మకంతో మార్పు తీసుకురాగల నేతగా సంతోష్ కుమార్ ఎదుగుతున్నారు. నామినేషన్ అనంతరం అభ్యర్థి జక్కుల సంతోష్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ:వెల్లుట్ల అభివృద్ధి నా లక్ష్యం, ప్రజలు ఆశించే మార్పు కోసం, వారి ప్రతి సమస్య పరిష్కారానికి నేను సిద్ధంగా ఉన్నాను. కాంగ్రెస్ పార్టీ తరఫున బలపరిచి, నాకు అవకాశం ఇచ్చిన స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ కు, అలాగే పార్టీ అధిష్టానానికి హృదయపూర్వక కృతజ్ఞతలు. మా గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లడానికి నా వంతు కృషి చేస్తాను అని అన్నారు. స్థానికుల అభిప్రాయం ప్రకారం చేతులు కలిపే ముందు హృదయం కలిపే నాయకుడు' గా సంతోష్ కుమార్ కు గ్రామంలో ప్రత్యేక గుర్తింపు లభించింది. గ్రామ ప్రజల మద్దతు, యువతలో ఉత్సాహం, మహిళల ఆశీర్వాదాలు ఈ ఎన్నికల్లో ఆయనకు బలమైన వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి.

## నాగిరెడ్డి పేట లో కల్లు దుకాణాలపై ఆకస్మిక దాడులు

**- అనుమతులు లేకుండా కల్లు విక్రయిస్తున్న నిర్వాహకుడి పై కేసు నమోదు**

**- ఎల్లారెడ్డి ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్**

**సూర్య,నాగిరెడ్డిపేట్**



మండలంలోని వాడి గ్రామంలో అనుమతులు లేకుండా కల్లు విక్రయిస్తున్న కల్లు విక్రయ దారుడి పై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి ఎక్సైజ్ సిఐ షాకీర్ హైమద్ తెలిపారు. మంగళవారం ఎక్సైజ్ శాఖ అధికారులు వాడి గ్రామంలోని కల్లు దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాడి గ్రామంలో నిర్వహిస్తున్న కల్లు దుకాణం ప్రభుత్వం ద్వారా ఎటువంటి లైసెన్స్ లేకుండా కల్లు విక్రయిస్తుండడంతో కల్లు దుకాణం పై దాడులు జరిపి కల్లు దుకాణ నిర్వాహకుడు మల్లాగౌడ్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. అనంతరం మండలంలోని చీనూర్, గోలి లింగాల్ గ్రామాల్లోని కల్లు దుకాణాలలో కల్లు శాంపిల్లను సేకరించి ల్యాబ్ కు పంపించినట్లు తెలిపారు. ఎక్సైజ్ శాఖ అనుమతులు లేకుండా గ్రామాలలో ఎవరైనా కల్లు విక్రయించడంతోపాటు మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ పెంటయ్య,కానిస్టేబుళ్లు రవీందర్ రెడ్డి, రజిత, సావిత్రి ఉన్నారు.

## రోడ్డు పక్కన చిరుత

**- ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికుల గుండెల్లో గుబులు పుట్టించిన చిరుత పులి**

**- మొబైల్‌లో వీడియోలు,ఫోటోలు తీసిన ప్రయాణికులు%!**

**సూర్య ఎల్లారెడ్డి**




రోడ్డు పక్కన భయంకరమైన చిరుత పులి , అప్పుడే ఆర్టీసీ బస్సు ఆ దారి గుండా నడిపించిన వ్యక్తులపై ప్రయాణికులతో వెళుతుంది అంతలోనే చిరుత పులిని చూసిన డ్రైవర్స్ ఎల్లారెడ్డి బస్సును ఆపివేశారు దాంతో బస్సులో ఉన్న ప్రయాణికులు భయంతో గజగజ వనికారు కొంతమంది ప్రయాణికులు చిరుత పులిని తొలగిస్తే మొబైల్ లో వీడియోలు తరచుగా చిత్రీకరించారు. కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం మిద్ద మేట్టు వద్ద కే కే వై ప్రధాన రహదారి పక్కనే ఉన్న చిరుత ను ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు వీడియోలు తీసిన సంఘటన చోటుచేసుకుంది. కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డి వస్తున్న ఆర్టీసీ బస్సు లింగంపేట మండలం మిద్ద మేట్టు వద్ద చిరుత పులిని గమనించిన ఆర్టీసీ డ్రైవర్ బస్సును ఆపివేయగా బస్సులో ఉన్న ప్రయాణికులు ఇది గమనించి వారి మొబైల్ ఫోన్లలో చిరుత కదలికలను వీడియో తీశారు. ప్రస్తుతం ఆ వీడియో నెట్టింట వైరల్ గా మారింది. అన్ని వాట్స్ అప్ గ్రూప్ లలో చెక్కర్లు కొడుతుంది. కాగా రెండు రోజుల క్రితం మెంగారం గ్రామం వద్ద చిరుత ఎల్లారెడ్డి- కామారెడ్డి ప్రధాన రహదారిని దాటుతుండగా పోలీసులు మొబైల్ ఫోన్లో ఫోటోలు తీయగా ఆ ఫోటోలు సైతం వైరల్ గా మారాయి. ఇంతవరకు బాగానే ఉన్నా చిరుత పులి సంచారంతో మేంగారంతో పాటు లింగంపేట అటవీ ప్రాంతానికి దగ్గర గా ఉన్న శివారు గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనను వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఎల్లారెడ్డి- లింగంపేట మధ్య రాత్రి పూట ప్రయాణం చేయాలంటే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు.రాత్రివేళ ద్విచక్ర వాహనాదారులకు భయాందోళన మొదలైంది.

## మీడియా సెంటర్, ఎంసిఎంసి కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

**సూర్య నిజామాబాద్,జిల్లా ప్రతినిధి**



గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసిఎంసి) సెల్ ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం సందర్శించారు. ఎన్నికల సందర్భంగా ఎంసిఎంసి ద్వారా చేపడుతున్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంసిఎంసి కేంద్రంలోని రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం కంట్రోల్ రూమ్ ను సందర్శించి ఎన్నికలతో ముడిపడిన అంశాలకు సంబంధించి ఫోన్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు, సూచనలను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎంసిఎంసి కమిటీ మెంబర్ సెక్రెటరీ ఎన్.పద్మశ్రీ తదితరులు ఉన్నారు.

## ఎయిడ్స్ పై ఆరోగ్య కార్యకర్తలకు ఆశ వర్కర్లకు అవగాహన

**- డాక్టర్ శరత్ కుమార్**

**సూర్య,ఎల్లారెడ్డి**



ఎయిడ్స్ పై ఆరోగ్య కార్యకర్తలకు ఆశ వర్కర్లకు మతమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శరత్ కుమార్ మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డిసెంబర్ 1న ఎయిడ్స్ డే సందర్భంగా, ప్రపంచవ్యాప్తంగా ఎయిడ్స్ డే ను నిర్వహిస్తారని, ఆరోగ్య కార్యకర్తలకు ఆశ వర్కర్లకు తెలిపారు. అవగాహన సదస్సులో, మతమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శరత్ కుమార్ మాట్లాడుతూ,ప్రజలకు అవగాహన కల్పించడానికి, (యచ్ ఐ వి ) గురించి సరైన సమాచారం అందించాలి, దాని నివారణ పద్ధతులను వివరించాలి హెచ్ఐవి సోకిన వారితో వివక్ష చూపకుండా ఉండాలని చెప్పాలనీ అన్నారు. సమాజంలో అవగాహన పెంపొందించడానికి, ప్రజలను దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సూచించడానికి వారు సహాయం చేయాలి.

**అవగాహన కల్పించే పద్ధతులు:**

సరైన సమాచారం అందించడం: హెచ్ఐవి/ఎయిడ్స్ గురించి అపోహలను తొలగించి, దాని వ్యాప్తి, నివారణ, చికిత్స గురించి సరైన సమాచారం ఇవ్వాలి.అని అన్నారు

**నివారణ పద్ధతులు:** సురక్షితమైన లైంగిక సంబంధాలు, హెచ్ఐవి నిర్మూలన పద్ధతులు, దాని గురించి అవగాహన కల్పించడం.

**సామాజిక మద్దతు:** ఎయిడ్స్ ఉన్న వ్యక్తులను చూసి భయపడకుండా, వారికి సమాజంలో మద్దతు ఇవ్వాలని ప్రోత్సహించాలి.

**వైద్య సేవలు:** అనుమానిత వ్యక్తులను దగ్గరలోని ఆరోగ్య కేంద్రాలకు సూచించి, అవసరమైన పరీక్షలు, చికిత్సలు చేయించుకోవడానికి సహాయపడాలి.

**ముందస్తు పరీక్షలు:** గర్భిణీ స్త్రీలకు హెచ్ఐవి పరీక్షలు చేయించుకోవడం ప్రాముఖ్యత గురించి చెప్పాలి. తల్లి నుంచి బిడ్డకు సంక్రమించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

**నిరంతర అవగాహన:** ఎప్పటికప్పుడు హెచ్ఐవి/ఎయిడ్స్ గురించిన కొత్త సమాచారం ప్రజలకు తెలియజేయాలి, అని అవగాహన సదస్సులు మతమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శరత్ కుమార్ ఆరోగ్య కార్యకర్తలకు ఆశా వర్కర్లకు అవగాహన సదస్సులో తెలిపారు. ఈ కార్యక్రమంలో, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జెపి నడ్డాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ అర్వింద్

**సూర్య ఇందూర్**



భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు, కేంద్ర ఆరోగ్య, రసాయన మరియు ఎరువుల శాఖ మంత్రి జెపి నడ్డాకు నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ఎంపీ అర్వింద్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని నడ్డా కార్యాలయంలో సహచర పార్లమెంటు సభ్యులు డీకే అరుణ, రఘునందన్ రావు మరియు గోడం నగేష్ లతో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## మండలంలో ముసిన రెండో విడత నామినేషన్ల ప్రక్రియ

**- మండలంలో 98 సర్పంచ్ నామినేషన్లు దాఖలు**

**- 396 వార్డ్ సభ్యుల నామినేషన్లు దాఖలు**

**సూర్య, నాగిరెడ్డిపేట్**

గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా నాగిరెడ్డిపేట్ మండలంలో రెండవ విడత నామినేషన్ల ప్రక్రియ మంగళవారం నాటితో ముగిసింది. మండలంలో 27 గ్రామ పంచాయతీలకు గాను సర్పంచ్ స్థానాలకు 98 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో లలిత కుమారి తెలిపారు. అలాగే మండలంలో 232 వార్డ్ స్థానాలకు గాను 396 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆమె తెలిపారు.

## బిఆర్ఎస్, బిజెపిల నుండి కాంగ్రెస్ లో చేరికలు

**సూర్య- బిక్కనూర్**

మండలంలోని తిప్పపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాములు,బాలరాజు,రాజ్ కుమార్,బీజేపీ పార్టీకి చెందిన సాయిరాంగౌడ్, హర్షవర్ధన్ రెడ్డి,శ్రీమన్, దీపక్,చందు,సాగర్ గౌడ్, సతీష్ లు తమ తమ పార్టీలకు రాజీనామా చేసి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనలో కొనసాగుతున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నట్లు వారు ప్రకటించారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు దారుడి విజయానికి కృషి చేస్తామన్నారు.